ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 03.05.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులకే పేదలకే లబ్ది చేకూరాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

2. దేశ వ్యాప్తంగా చేపట్టబోయే కులగణనకు తెలంగాణ ప్రభుత్వ విధానాన్ని నమూనాగా తీసుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

3. హైదరాబాద్ లోని అంబ ర్ పేట్ నుంచి రామంతాపూర్ వరకు నిర్మించిన ఫ్లై ఓవర్ ను ఎల్లుండి సాయంత్రం కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.

4. రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**ఇందిరమ్మ ఇండ్లు- మంత్రి పొంగులేటి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులకే లబ్ది చేకూరాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పథకంలో పూర్తి పారదర్శకత ఉండాలని , పేదలకే ఇండ్లను కేటాయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. రిజిస్ట్రేషన్ల శాఖలో పదోన్నతి పొందిన వారికి మంత్రి ఈరోజు హైదరాబాద్

లో ఆర్డర్ దస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణంలో ఆధునిక సాంకేతికత వాడుతున్నామని తెలిపారు. ఈ పథకం విషయంలో ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను చెప్పేందుకు త్వరలో ఓ టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు.

(డెస్క్)

**ఖమ్మం-తుమ్మల**

పంట మార్పిడి విధానంతో అకాల వర్షాల నష్టాలను తగ్గించవచ్చని , అకాల వర్షాల వల్ల దెబ్బతినని ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటను రైతులు సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఖమ్మం జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షం , తీవ్రమైన గాలులకు దెబ్బతిన్న బొప్పాయి తోటలను , ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి , జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రాష్ట్రంలో ఇప్పటికే 25 వేల ఎకరాలలో పంట నష్టం జరిగిందన్నారు. గత రెండు , మూడు రోజులుగా కురిసిన వడగండ్ల వాన, అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలపై కలెక్టర్లు నివేదికలు పంపాలని మంత్రి చెప్పారు.

(PTC, khammam)

**అంబర్ పేట్ ఫ్లై ఓవర్ -కిషన్ రెడ్డి**

హైదరాబాద్ లోని అంబ ర్ పేట్ నుంచి రామంతాపూర్ వరకు నిర్మించిన ఫ్లై ఓవర్ ను ఎల్లుండి కేంద్ర రోడ్లు , రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభిస్తారని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. 4 వరసల్లో, 1.47 కిలోమీటర్ల పొడవుతో చేపట్టిన ఈ ఫ్లై ఓవర్ తో నగరవాసులకు ట్రాఫిక్ నుంచి ఉపశమనం కలిగించి , ప్రయాణాన్ని సులభతరం చేస్తుందని చెప్పారు . ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను ఈ ఉదయం కిషన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు 400 కోట్ల రూపాయలతో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు.

**సౌండ్ బైట్ ... కిషన్ రెడ్డి**

(డెస్క్)

**శ్రీధర్ బాబు**

తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు సమతుల్యమైన నగర ప్రణాళికలోనే ఉందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కరీంనగర్ లో జీనోమ్ వ్యాలీ విస్తరణ నుంచి మేడ్చ ల్ లో పారిశ్రామిక వృద్ధి వరకు తమ ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో ఆవిష్కరణ కేంద్రాలను నిర్మిస్తున్నదని ఒక సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం శ్రీశైలం సమీపంలో ఫ్యూచర్ సిటీ రూపకల్పన జరగుతుందన్నని చెప్పారు. ఇది కేవలం వృద్ధి కోసం మాత్రమే కాకుండా , స్థిరమైన,తెలివైన వ్యవస్థీకృత పురోగతి కోసం ప్రణాళిక వేసుకునే సమయమని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

(డెస్క్)

**వనపర్తి-ధాన్యం**

వనపర్తి జిల్లాలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుందని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఉదయం చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను సందర్శించిన అదనపు కలెక్టర్ తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని ఆరబెట్టే చర్యలు తీసుకోవాలని , కొనుగోలు చేసి మిల్లులకు తరలించే ధాన్యాన్ని వెంటనే తరలించాలని అధికారులకు సూచించారు.

(పిటిసి, వనపర్తి)

**కొత్తగూడెం-అంగన్వాడీ**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలలోని ప్రీ స్కూల్ లకు వేసవి సెలవులు ఇచ్చిన నేపథ్యంలో గర్భిణీలు , బాలింతలకు వేడిగా వండిన భోజనం , 6 నెలల నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు సరుకులను టేక్ హోమ్ రేషన్ ద్వారా అందించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత ఒక ప్రకటనలో తెలియజేశారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు వార్షిక సర్వే , గృహ సందర్శనలు , 3సంవత్సరాలు పైబడిన పిల్లలను ప్రీస్కూల్ కి నమోదు చేయటం , డ్రాపవుట్ లను తిరిగి కేంద్రాల్లో చేర్పించటం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

(PTC- B.KGM)

**ఖమ్మం-వర్షాలు**

ఖమ్మం జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షం , ఈదురు గాలులతో మామిడి రైతులు నష్టపోయారని జిల్లా ఉద్యాన , పట్టు పరిశ్రమ అధికారి ఎంవీ మధుసూదన్ చెప్పారు. నేలకొండపల్లి మండలంలో 14 మంది రైతులకు చెందిన 40 ఎకరాల్లో , కూసుమంచి మండలంలో ఇద్దరు రైతులకు సంబంధించి 20 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఉద్యాన అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పంట నష్టం ప్రాథమిక అంచనా నివేదిక తయారు చేసినట్లు తెలిపారు.

(PTC, khammam)

**వాతావరణం**

రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది . ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది . ఈరోజు, రేపు కొమరంభీం ఆసిఫాబాద్ , మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి ,

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి , నాగర్ కర్నూల్ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉంద ని పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది . అదే సమయంలో రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని తెలిపింది.

(డెస్క్)

**మంచిర్యాల - బంద్**

జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో పర్యాటకులపై జరిగిన దాడిని ఖండిస్తూ మంచిర్యాల కార్పొరేషన్ లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఈరోజు బంద్ నిర్వహిస్తున్నారు. హిందూ ఐక్యవేదిక, ఛాంబర్ ఆఫ్ కామర్స్, కుల సంఘాలు, కార్మిక సంఘాలు,అన్ని రాజకీయ పార్టీలు ఈ బంద్ లో పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాకిస్తాన్ పై చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు.

(పిటిసి, మంచిర్యాల)

**సిరిసిల్ల-పెద్దపులి**

జిల్లాలో పెద్దపులి సంచారిస్తున్న నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ ఖలీలుద్దీన్ చెప్పారు. వేములవాడ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ఐదు మండలాల్లో పెద్దపులి సంచరిస్తుందని ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆకాశవాణితో చెప్పారు.

(బైట్ వేములవాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఖలీలుద్దీన్)

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**కొత్తగూడెం-కలెక్టర్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల మధ్యలో ఇండ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

(PTC- B.KGM)

**నల్లగొండ-నీట్**

నల్లగొండ జిల్లాలో రేపు నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్- నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రేపు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పరీక్షకు జిల్లాలో 2048 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, ఇందుకు నల్గొండ జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు.

( పిటిసి నల్లగొండ జిల్లా)

**నల్లగొండ-కలెక్టర్**

నల్లగొండ జిల్లాలో వర్మి కంపోస్టు ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.జిల్లాలోని చిట్యాల , నార్కెట్ పల్లి మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు , గ్రామ పంచాయతీల ద్వారా నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. నార్కెట్ పల్లి లో సగ్రిగేషన్ షెడ్ ను పరిశీలించిన కలెక్టర్ వర్మి కంపోస్ట్ ద్వారా వచ్చిన ఎరువును విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు.

(పీటీసీ, నల్లగొండ)

**మెరిట్ లిస్టుపై అభ్యంతరాలు స్వీకరణ**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ రకాల 52 పోస్టులు అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ కోసం ప్రకటించిన మెరిట్ లిస్టుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎల్లుండి లోపు తెలియజేయాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యంతరాలను రాతపూర్వకంగా జిల్లా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

**జగిత్యాల జిల్లా -నవరాత్రి**

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి నవరాత్రి ఉత్సవాలు ఈరోజు ఉదయం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా 9 రోజులు స్వామికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహిస్తారు. భక్తులకు త్రాగునీరు - చలువ పందిరితో పాటు ప్రతిరోజూ ఉచిత అన్నదానం వంటి ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

(పీటీసీ జగిత్యాల)

**ఆసిఫాబాద్- బీఎస్ఎస్ఎల్ టవర్లు**

భారత్ సంచార్ నిగం లిమిటెడ్ నెట్ వర్క్ టవర్ల నిర్మాణ ప్రక్రియను ఆసిఫాబాద్ జిల్లాలో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. వివిధ శాఖల అధికారులు , బీఎస్ఎన్ఎల్ అధికారులతో టవర్ల ఏర్పాటుపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మారుమూల ప్రాంతాలకు మొబైల్ నెట్ వర్క్ సేవలు అందించే విధంగా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు.

(పీటీసీ, ఆసిఫాబాద్)